క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి సాయం



పాలకుర్తి టౌన్: తమతో పాటు చదువుకున్న తోటి స్నేహితుడి కుటుంబాన్ని మిత్రులు ఆదుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 పదో తరగతి బ్యాక్‌కు చెందిన చిట్యాల సంపత్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందడంతో ఆయన భార్య, కూమార్తె, కుమారుడు ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో స్పందించారు. పూర్వవిద్యార్థులు సేకరించిన రూ.40 వేలను శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. స్నేహితులు డీవీఆర్‌శర్మ, వీరమానేని వెంకటేశ్వర్‌రావు, బొగ్గరాపు నాగరాజు, చారగోండ్ల శ్రీను, రాపోలు లక్ష్మన్, మామిండ్ల సోంమల్లు, కమ్మగాని పరమేశ్వర్, ఆకినపెల్లి ప్రవీణ్, సోమేశ్వర్ ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా



స్టేషన్‌ఘన్‌పూర్: పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి ఆర్థికంగా భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్లుకు చెందిన రంగు వంశీ నాలుగు నెలల కుమారుడు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వంశీ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో సీఎం సహాయనిధి నుంచి రూ.2.50లక్షలు ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో బాధితుడి కుటుంబ సభ్యులకు శనివారం ఎల్‌ఓసీని అందించారు.

మున్నూరు కాపు సంఘం మండల కమిటీ ఎన్నిక

పాలకుర్తి టౌన్: మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా దర్దేపల్లి గ్రామానికి చెందిన తాడెం సారయ్య ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మున్నూరు కాపు సంఘం సమావేశంలో మండల నూతన కమిటీని ఎకగ్రీవంగా ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా కర్ర పెద్దన్న(ముత్తారం), కార్యదర్శిగా గంట యాకయ్య(వావిలాల), ఉపాధ్యక్షులుగా నాసం మధుసూదన్(రాఘవాపురం), ప్రచార కార్యదర్శిగా దిండిగాలా వెంకన్న(మల్లంపల్లి), సహాయ కార్యదర్శి గా పడకంటి సంపత్(పాలకుర్తి), కోశాధికారిగా సిద్దాం భాస్కర్ (దర్దేపల్లి), కమిటీ సభ్యులుగా గుండా పిచ్చమ్మ (దర్దేపల్లి), కర్ర భాస్కర్(ముత్తారం), వీరమల్ల లలిత(వల్మిడి) ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం, జిల్లా అధ్యక్షులు పోగుల సారంగపాణిలు అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి రమేష్, జిల్లా కార్యదర్శి తాడేం రవి, కొండపల్లి కుమారస్వామి, రవీందర్ పాల్గొన్నారు.

యాదవసంఘం గ్రామ కమిటీ..

చిల్పూరు: కృష్ణాజీగూడెం యాదవ సంఘం కమిటీని గ్రామ పెద్ద గద్ద చంద్రయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పుల వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా సాదం (మచ్చ) వెంకటయ్య, కార్యదర్శిగా సాదం రవి, డైరెక్టర్లుగా సాదం సాంబరాజు, మాదర బోయిన ప్రసాద్, సాదం రవీందర్, దాసరి సాంబరాజు, సాదం రాజు, ఉప్పుగళ్ల రమేష్, గుండెల్లి రాజు ఎన్నికయ్యారు.

విద్యుత్ స్తంభాలు పక్కకు వేయాలని పెట్రోల్‌తో నిరసన



జనగామ రూరల్: శామీర్‌పేట గ్రామానికి చెందిన జిట్టే శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తమ పొలం నుంచి కరెంట్ స్తంభాలు వేయొద్దని పెట్రోల్ బాటిల్‌తో బావి వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండా అక్రమంగా తన పొలం నుంచి వేరే రైతు పామ్ ఆయిల్ తోటకు విద్యుత్ స్తంభాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సమాచారం అందుకున్న విద్యుత్ ఏఈ, లైన్‌మన్ వచ్చి పక్కనుంచి కరెంట్ స్తంభం వేస్తాం హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పలువురు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో శనివారం చేరారు. కాగా, వారికి దయాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కల్వగిరి సోమయ్య, బొలగాల శ్రీను, కూటికంటి వాసు, దాసరి ఉప్పలయ్య, పసునూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తడి కష్టాలు తీరేదెప్పుడో?

- ఉధృతంగా అలుగు పారితే దారి బంద్
- ఏటా వర్షాకాలంలో తప్పని వెతలు
- బ్రిడ్జి కావాలంటున్న ఇబ్రహీంపూర్ గ్రామస్తులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు



ఇబ్రహీంపూర్ చిన్న మత్తడి వద్ద నీళ్ల లోంచే రాకపోకలు సాగిస్తున్న యువకులు

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ పెద్ద చెరువు అలుగు పారిందంటే ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. చిన్న మత్తడి అలుగు ఉధృతంగా ప్రవహిస్తే ఒక్కో సారి రాకపోకలు నిలిచి పోతున్నాయి. చెరువు పెద్దమత్తడి ముందు బ్రిడ్జి నిర్మించగా, చిన్న మత్తడి ముందు బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనల దశ దాటడం లేదు. అలుగు పారిన ప్రతి సారి మరో దారి లేకపోవడంతో వాగులో నుంచి భయం భయంగా రాక పోక రాకపోకలు సాగించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత ఊరులో ఉన్న గ్రామ పంచాయతీ, మహిళా సంఘం భవనం, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లడం గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు కష్టంగా మారింది. చిన్న మత్తడి అలుగు ఉధృతంగా పోస్తే విద్యార్థులు పాఠశాలకు బంద్ కావాల్సి ఉండే. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో బ్రిడ్జి నిర్మిస్తామని చెబుతోన్న ప్రజాప్రతినిధులు అనంతరం ఆ విషయాన్ని విస్మరిస్తున్నారు. చిన్న మత్తడి ముందు బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు ఎప్పటి నుంచో పలుమార్లు పాలకులను కలిసి విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేదని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నైనా బ్రిడ్జి నిర్మాణం చేపట్టి కష్టాలు తీరుస్తారని ఆశిస్తున్నారు. మత్తడి ఉధృతి సమయంలో గ్రామస్తులు వాగు దాటకుండా పంచాయతి సిబ్బంది దారిపై అడ్డుగా ట్రాక్టర్, కంప వేస్తున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఉన్నతాధికారులు స్పందించి చిన్న మత్తడి ముందు బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



చిన్న మత్తడి ముందు బ్రిడ్జి లేకపోవడంతో అలుగు పోసిన ప్రతీసారి నీళ్లలోంచి రాక పోకలు సాగిస్తూ నానా తంటాలు పడుతున్నాం. దశాబ్దాలుగా ఇవే తిప్పలు, పాలకులు వస్తున్నారు. పోతున్నారు తప్ప బ్రిడ్జి మంజూరి చేసిన వారు లేరు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి బ్రిడ్జి నిర్మించి మా కష్టాలు తీర్చాలి.

- కొండ అశోక్, ఇబ్రహీంపూర్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



గ్రామం మధ్యలో ఉన్న చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించే సమయంలో అవతలికి దాటలేక అవస్థలు పడతున్నాం, మరో దారి లేక వాగులోంచే భయం భయంగా వెళ్లాల్సి వస్తుంది. గతంలో బ్రిడ్జి నిర్మిస్తామని హామి ఇచ్చారు. కాని కార్యరూపం దాల్చడం లేదు. ఎమ్మెల్యే బ్రిడ్జి మంజూరి చేస్తారని ఆశిస్తున్నాం.

- పబ్బ శేఖర్, ఇబ్రహీంపూర్

లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



కోనేరు వద్ద భక్తులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని వేల్పుగొండ కొండపై వెలసిన లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ప్రతీ ఏటా శ్రావణ మాసం నెల రోజుల పాటు నిర్వహించే స్వామివారి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కాగా, శనివారం నృసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో కొండపై ఉన్న కోనేరులో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, భక్తుల కోసం ఆర్యవైశ్యులు అన్నదానం నిర్వహించారు. అన్నదాన కమిటీ అధ్యక్షుడు చిట్టిమళ్ల కృష్ణమూర్తి, పాలకుర్తి రాజయ్య, శ్రవణ్‌కుమార్, రమేశ్, నాగరాజు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు యుగంధర్, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్ ప్రధానితో తెలంగాణ కళాకారులు



తెలంగాణ కళాకారులతో న్యూజిలాండ్ పీఎం క్రిస్టోఫర్ లక్సన్



అవార్డు అందుకుంటున్న సంతోష్

లింగాలఘణపురం/జనగామ రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరుగుతున్న సాంస్కృతికోత్సవానికి ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ కళల ప్రదర్శనకు మంత్రముగ్ధులై కళాకరులతో ఫోటోలు దిగారు. ఆయనతో పాటు భారత హై కమిషనర్ నీతాభూషణ్, ఇండియన్ కాన్సులేట్ జనరల్ మోహన్ శెట్టి తదితరులు ఉన్నారు. రాష్ట్రం నుంచి వివిధ కళారూపాలు ప్రదర్శించిన వారితో డాక్టర్ ఒగ్గు రవి, అశోక్, భాస్కర్, నల్లపాగ స్వామి, ధరావత్ రాజ్‌కుమార్ ఉన్నారు. కాగా సాంస్కృతికోత్సవాల్లో భాగంగా పేరిణి నృత్యం ప్రదర్శించిన జనగామకు చెందిన పెరుమాండ్ల సంతోష్‌ను అక్కడి ప్రభుత్వం అభినందించి అవార్డును అందజేసింది.

కాలభైరవుడి ఉత్సవాలు



బచ్చన్నపేట: గంగాపురంలో వెలసిన కాలభైరవ స్వామి ఉత్సవాలను గ్రామస్తులు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకుడు సాయిచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. ఎడ్ల జ్యోత్స్న, మధుసూధన్‌రెడ్డి దంపతులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, సునీత్ రెడ్డి, సోమి రెడ్డి, విజయ్‌రెడ్డి, సాయికుమార్, కరుణాకర్, నర్సయ్య, రమేశ్ పాల్గొన్నారు.

పరామర్శ



పాలకుర్తి: మండలంలోని బమ్మెర గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు జిట్టబోయిన శ్రీనివాస్ తల్లి సోమక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే శాతపురంలో బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు నరేష్ తండ్రి హసావత్ శక్రు నాయక్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నివాళి

కొడకండ్ల: మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన నామాల ఈదయ్య తండ్రి కొమురయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ చైర్మన్ నల్ల అండాళ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్‌తో పాటు నాయకులు.. కొమురయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఊరూరా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉట్టి కొట్టి సందడి చేశారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు.

జనగామ: శ్రీకృష్ణ ఆలయం గీతాశ్రమంలో పూజ చేస్తున్న భక్తులు



జనగామ: హిందూ జ్ఞాన వేదిక-ప్రభోధాసేవ సమితి ఆధ్వర్యంలో..



జనగామ: కుర్మవాడ అంగన్‌వాడీ సెంటర్ వద్ద వేడుకల్లో చిన్నారులతో అంగన్‌వాడీలు



దేవరుప్పల: సింగరాజుపల్లిలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు





జనగామ: గ్రెయిన్ మార్కెట్ ఆలయంలో..



రఘునాథపల్లి: కోమల్లలో..



జఫర్‌గఢ్: గీతాంజలి పాఠశాలలో..



జనగామ: గీతానగర్‌లో..



నర్మెట: వేణుగోపాల స్వామి ఆలయంలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో శ్రీకృష్ణుడికి సమర్పించిన 33 రకాల నైవేద్యాలు



మల్కాపూర్‌లో వేడుకల్లో చిన్నారులు



బచ్చన్నపేటలో..







జనగామ: చిన్నికృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



చిల్పూరులో..



కొడకండ్ల: ఉట్టి కొడుతున్న విద్యార్థులు



తాటికొండ అంగన్‌వాడీ సెంటర్‌లో..

విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బాని కావొద్దని, సన్మార్గంలో నడవాలని స్థానిక ఎస్సై పిట్ల రాజేశ్ అన్నారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి శివారులోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఘన్‌పూర్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఎస్సై మనీషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వారకల్యాణం



వారకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం వైభవంగా స్వామివారికి వారకల్యాణం నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన పలువురు దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ధర్మకర్తలు గణగోని రమేష్, గోలి రాజశేఖర్, చల్లా వెంకటరమణాదేవి, వీరన్న, లక్ష్మి,మల్లికార్జున్, హరిశంకర్, కృష్ణ పాల్గొన్నారు.

జీవాల్లో కాలి పుండ్ల నివారణకు చర్య తీసుకోవాలి



జీవాలకు చికిత్స చేస్తున్న డాక్టర్ అనేష్

చిల్పూరు: వర్షాకాలంలో గొర్రెలు, మేకల కాళ్లకు పుండ్లు ఏర్పడి వచ్చే 'ఫుట్ రాట్' వ్యాధి నివారణ కోసం చర్యలు తీసుకోవాలని యజమానులకు మండల పశువైద్యాధికారి మూడిక అనేష్ సూచించారు. మల్కాపూర్ పశువైద్య శాలలో ఆయన శనివారం మాట్లాడుతూ వర్షాలు పడగానే జీవాల కాళ్లకు పుండ్లు పడుతాయని, ఇవి గొర్రె ల కాళ్లను ప్రభావితం చేసి వాటికి కుంటి తనం, ఆర్థిక నష్టానికి దారి తీస్తుందన్నారు. ముఖ్యంగా కలుషితమైన నేల, నీరు, అపరిశుభ్రతతో బ్యాక్టీరియా చేరి పాదాల వాపు, కుంటితనం, పాదాల మధ్య చర్మం కుళ్లి పోవడం, దుర్వాసన, జ్వరం, ఆకలి మందగించడం జరుగుతుందన్నారు. నివారణ కోసం మందలో ఏదైనా గొర్రెకు ఫుట్ రాట్ వ్యాధి సోకితే వెంటనే చికిత్స చేయాలన్నారు. పరిసరాలను శుభ్రత పాటిస్తూ పుండ్లతో దెబ్బతిన్న కాలి గిట్ట కొన భాగాలను కత్తిరించి శుభ్రం చేయాలని సూచించారు. చికిత్స కోసం గిట్టల మధ్యలో పొటాషియం పరమాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలని, నొప్పి ఉంటే మెలోక్సామ్ ఇంజక్షన్‌లు వేయించాలన్నారు. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ తగ్గించడానికి ఆక్సి టెట్రాసైక్లిన్ వంటి యాంటీ బయాటిక్స్ 5 రోజులు వాడాల్సి ఉంటుందన్నారు. వ్యాధి సోకిన జీవాల గిట్టలను, కాళ్లను 10 శాతం జింక్ సల్ఫేట్ లేదా 5 శాతం ఫార్మాలిన్ ద్రావణంలో ఐదు నిమిషాలు ఉంచాలని సూచించారు. ఇలా చేయడంతో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

బ్రిడ్జిలు నిర్మించి ప్రమాదాలు నివారించాలి

జనగామ రూరల్: గానుగుపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జిలు నిర్మించి ప్రమాదాలు నివారించాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురామ్ కోరారు. శనివారం కలెక్టరేట్ వద్ద బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. దీక్షలో సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కర్ణాకర్, ఎల్లబోయిన శ్రీశైలం, రావుల రఘు గౌడ్, దడిగె సంపత్, కమలాకర్, భిక్షపతి పాల్గొన్నారు.

కొత్త చట్టంపై అవగాహన ఉండాలి

జనగామ రూరల్: దేశంలో కొత్తగా రూపొందిస్తున్న చట్టంపై ముస్లింలు అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది మహమ్మద్ జమాల్ షరీఫ్ అన్నారు. శనివారం పట్టణంలోని జమా మజీద్‌లో నమాజ్ అనంతరం గుండ్ల గడ్డ మదీనా మజీద్ అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ మతీన్ అతర్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జమా మజీద్ కార్యదర్శి ఖాజా ముజ్జహిదుద్దీన్, మహమ్మద్ మసీ ఉర్ రహమాన్ ముహమ్మద్ సమద్, ఇబ్రాహీం,కలిమద్దీన్, అజ్మత్ ఖాన్, అన్వర్ చంద్ భాయ్ పాల్గొన్నారు.

సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల హైదరాబాద్‌లో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన మోటం శ్రీనివాస్‌కు దళితరత్న అవార్డు అందించి అభినందించింది. ఈ మేరకు శ్రీనివాస్‌ను ఘన్‌పూర్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీటీసీ అంబటి జైహింద్‌రాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి..

దేవరుప్పుల: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో స్థానిక ఎస్సై ఊర సృజన్‌కుమార్‌కు జిల్లా ఉత్తమ సేవకులుగా పురస్కారం రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ విజయ డెయిరీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కాసారపు ధర్మారెడ్డి శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, సీనియర్ నాయకులు ప్రభాకర్, యాదగిరి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పూర్వ విద్యార్థుల దాతృత్వం



దాతల తల్లిదండ్రులను సన్మానిస్తున్న టీచర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం వాస్తవ్యులు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పోకల ఆంజనేయులు కుమారులు, పాఠశాల పూర్వ విద్యార్థులైన పోకల జయప్రకాశ్, హరిప్రకాశ్, శివప్రకాశ్ గ్రామంలోని జెడ్పీఎస్‌ఎస్‌కు తమవంతుగా రూ.50వేలు విలువైన మినరల్ వాటర్‌ప్లాంట్, విద్యార్థులకు రూ.15వేలు విలువైన వాటర్‌బాటిల్స్‌ను అందజేశారు. ఈ మేరకు పాఠశాలలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలైన పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు పోకల ఆంజనేయులు, అంజమ్మను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం రఘుజీ, పాఠశాల మాజీ చైర్మన్ వారాల రాజు, దార్న శ్రీధర్, బెలిదె శంకర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోపూజ



లింగాలఘణపురం: చీటూరులో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ పరిషత్ ఆదేశానుసారం శ్రీరామదాసు భజన మండలి తెలుగు రాష్ట్రాల సేవా సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వరస్వామి పర్యవేక్షణలో జరిగిన గోపూజలో భక్తులు ఇంటింటికి పసుపు, కుంకుమాలతో గోవుకు స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో హరేరామ హరే కృష్ణ పాటలతో భజనలు చేస్తూ ఊరేగించారు. మోహన్‌రెడ్డి, సులోచన, భాస్కర్, రాణి, అనిల్‌రెడ్డి, వెంకటలక్ష్మి, శ్రీనివాసు, మల్లేశం పాల్గొన్నారు.

పింఛన్లు పెంచి తీరాలి



రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామి మేరకు దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు చేయూత పెన్షన్లు రూ.4 వేలు పెంచి తీరాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు సందెన రవీందర్‌మాదిగ, బొట్ల మహేష్ డిమాండ్ చేశారు. శనివారం రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల్లోని కంచనపల్లి, కన్నాయపల్లి, చాగల్లులో దివ్యాంగులు, చేయూత పెన్షన్ దారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షన్ల పెంపు సాధన కోసం ఈ నెల 28న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో నిర్వహించే పెన్షన్ దారుల సమావేశానికి అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని వారు పిలుపు నిచ్చారు. సమావేశంలో కొంపెల్లి అంబేడ్కర్, చాడ ఏలియా, నలిమెల నాగరాజు, గాదె శ్రీధర్, బాలస్వామి, రాజబాబు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామ పెద్దలు శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విజ్ఞప్తి చేశారు. హనుమకొండలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని పోచమ్మ గుడి వద్దకు సీసీ రోడ్డు, చెరువులోకి వచ్చే కాల్వ మరమ్మతు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. తమ వినతికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు. అలాగే దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను క్యాంపు కార్యాలయంలో గబ్బెట గ్రామ పెద్దలు మర్యాద పూర్వకంగా కలిసి గ్రామాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.